సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం। 15। అక్టోబర్। 2023



గండిపోశమ్మ ఆలయ సందర్శన

గండిపోశమ్మ అమ్మవారిని జిల్లా దేవదాయ, ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ శనివారం సందర్శించారు.

10లో



భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

పాడేరులో శనివారం శ్రీరాముని శోభాయాత్రను విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు నిర్వహించారు.

10లో



కాలభైరవునికి ప్రత్యేక పూజలు

పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

10లో

న్యూస్‌రీల్

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ రూరల్: పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనలో భాగంగా ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు. టైలరింగ్, కార్పెంటర్, తాపీ రంగాల్లో శిక్షణ పొందేందుకు గాను ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈనెల 30లోగా వీటిని అందజేయాలని ఆయన కోరారు.

ఏటీడబ్ల్యూవో హాసినికి సత్కారం



హాసినిని సన్మానిస్తున్న గంగవరం ఆశ్రమపాఠశాల ఉపాధ్యాయులు

గంగవరం : గ్రూప్ వన్‌లో కొలువు సాధించి మచిలీపట్నం వైద్య ఆరోగ్య కార్యదర్శిగా వెళ్తున్న అడ్డతీగల సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎం. హాసినిని శనివారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంపచోడవరం ప్రాంతాన్ని ఎన్నటికీ మరువలేనన్నారు. ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ మిత్రులు మరింత కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ హేన్సన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా రోడ్ల నిర్మాణానికి చర్యలు

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు

అడ్డతీగల: మారుమూల గ్రామాలకు పక్కారోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. మండలంలోని బొడ్లంక–అచ్చియ్యపేట గ్రామాల మధ్య నాలుగు కిలోమీటర్ల మేరకు రూ.3 కోట్లు అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను వారు శనివారం ప్రారంభించారు. భూమిపూజ అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, వైస్ ఎంపీపీ కరణం వీర వెంకట రమణ, బొడ్లంక సర్పంచ్ బోనెం రాఘవ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు వేములోవ విద్యార్థినుల ఎంపిక



కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

గంగవరం : కాకినాడ డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఈ నెల 13న జరిగిన కబడ్డీ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. మడికి వెన్నెల, తోకల దుర్గాభవాని రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల పీడీ బాలరాజు తెలిపారు. కేటగిరి అండర్ 17 కేటగిరిలో వారు ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులు, పీడీని పాఠశాల ప్రధానోపాధ్యాయిని గీతాంజలి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అద్భుతం



వంజంగి హిల్స్‌పై ప్రకృతి అందాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. పాల సముద్రాన్ని తలపించేలా మేఘాలు.. చుట్టూ దట్టంగా కమ్ముకున్న మంచు తెరలు.. వీటిని చీల్చుకుంటూ ఉదయిస్తున్న భానుడి కిరణాలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. – పాడేరు

అబ్బురం



మండల కేంద్రమైన పెదబయలులో శనివారం మంచు అందాలు అబ్బురపరిచాయి. శనివారం ఉదయం 9.30 వరకు మంచు తెరలు అలుముకున్నాయి. వాహన చోదకులు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు. ఆ తరువాత తేలికపాటి వర్షం కురిసింది. – పెదబయలు

ఆహ్లాదం



రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన శిఖరంగా గుర్తింపు పొంది పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సీతమ్మపర్వతంపై పర్యాటకులు సందడి చేశారు. ఓలుబెడ్డా నుంచి నుంచి కాలినడకన కొండపైకి చేరుకున్నారు. కొండపై థింసా రాళ్లు, తేనెపట్టు గుహలను తిలకించారు. – హుకుంపేట

కాఫీ రైతుకు లాభాల గుబాళింపు

మన్యంలో కాఫీ రైతులకు ఈ ఏడాది గిట్టుబాటు ధర కల్పించే దిశగా కలెక్టర్ సుమిత్ కుమార్ కసరత్తు మొదలు పెట్టారు. సీజన్ ప్రారంభం నుంచి కొనుగోలు ధర పెంచేందుకు త్వరలో కాఫీ విభాగం లైజన్ వర్కర్లతో సమావేశం ఏర్పాటుచేసిన ధర నిర్ణయించనున్నారు. గతేడాది మాదిరిగా బోనస్ లేకుండా ఏకమొత్తంలో ఒకేసారి గిట్టుబాటు ధర చెల్లించే విధంగా ఆయన ఆదేశాలు ఇవ్వనున్నారు.

- బోనస్ లేకుండా ఏకమొత్తంలో గిట్టుబాటు ధర
- కొద్దిరోజుల్లో కాఫీ విభాగం లైజన్ వర్కర్లతో సమావేశం
- అదే రోజు ధర ప్రకటించే అవకాశం
- కసరత్తు మొదలుపెట్టిన కలెక్టర్ సుమిత్‌కుమార్



పాడేరు మండలం మోదాపల్లి ప్రాంతంలో విరగ్గాసిన కాఫీ

సాక్షి,పాడేరు: మన్యంలో కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పరంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకు కోసం ఆయన ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. ఈఏడాది ముందస్తుగానే దిగుబడి రావడంతో ముందస్తుగానే కొనుగోళ్లు ప్రారంభమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా జిల్లా యంత్రాంగం ఇప్పటినుంచి ఏర్పాట్లు చేస్తోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో పాడేరు ఐటీడీఏ పరిధిలో 11 మండలాల రైతులు 2.20 లక్షల ఎకరాల్లో కాఫీని సాగు చేస్తున్నారు. వీటిలో 1.56 లక్షల ఎకరాలు ఫలసాయం ఇస్తున్నాయి.

- గతేడాది 1.50 లక్షల ఎకరాల్లో కాఫీ తోటల ద్వారా 16 వేల మెట్రిక్ టన్నుల పాచ్‌మెంట్, క్లీన్ కాఫీ గింజలను రైతులు దిగుబడి సాధించారు. ఈఏడాది దిగుబడి బాగున్నందున 18 వేల మెట్రిక్ టన్నుల ఫలసాయం వచ్చే అవకాశం ఉంది కాఫీ ప్రాజెక్ట్ అధికారులు అంచనా వేస్తున్నారు.
- పాడేరు ఐటీడీఏ ద్వారా గత ఏడాది మాదిరిగానే కాఫీని పండ్ల దశలోనే కొనుగోలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఐటీడీఏ చైర్మన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ కసరత్తు మొదలుపెట్టారు.
- గతేడాది చింతపల్లి మ్యాక్స్ సొసైటీ ద్వారా కాఫీ పండ్లను కిలో రూ.36తో పాడేరు ఐటీడీఏ కొనుగోలు చేసింది.ఏజెన్సీ అంతటా 662 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు చేసిన మ్యాక్స్ సంస్థ, క్లీన్ కాఫీ గింజల ఉత్పత్తి అనంతరం 135 మెట్రిక్ టన్నుల పార్చ్‌మెంట్ కాఫీ గింజలను మార్కెటింగ్ చేసింది.కిలో రూ.312 ధరకు విక్రయించింది. సమకూరిన లాభాల ద్వారా కాఫీ పండ్లు అమ్మిన ప్రతి రైతుకు కిలోకు రూ.8 చొప్పున బోనస్‌ను పంపిణీ చేసింది. ఈ ఏడాది కూడా ఐటీడీఏ కాఫీ పంటను పండ్ల దశలోనే బోనస్ లేకుండా రైతులకు గిట్టుబాటు లభించేలా ఏక ధరతో కొనుగోలు చేసేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకోనున్నారు.

జీసీసీ ధర కిలో రూ.285..

గిరిజన సహకార సంస్థ ఈఏడాది కూడా కాఫీ గింజలను భారీగా కొనుగోలు చేసేందుకు తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో.285 ధర నిర్ణయించింది. గత ఏడాది కూడా కిలో రూ.270 ధరతో కాఫీ గింజలను కొనుగోలును ప్రారంభించింది. సీజన్ చివరిలో కిలోకు రూ.5కు పెంచింది. జీసీసీతో ప్రైవేట్ వ్యాపారులు పోటీ పడలేకపోయారు. గతేడాది జీసీసీ వెయ్యి మెట్రిక్ టన్నుల పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కొనుగోలు చేసింది. ఈఏడాది ఏజెన్సీ వ్యాప్తంగా భారీగా కాఫీ గింజలను కొనేందుకు ధరలను ముందుగానే ప్రకటించింది.

దళారుల బెడద లేకుండా చర్యలు



ఏజెన్సీలోని గిరిజనులు సాగుచేస్తున్న కాఫీ పంటకు జాతీయ స్థాయిలోనే నాణ్యమైన కాఫీగా గుర్తింపు ఉంది. అయితే గిరిజనుల కాఫీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ ఆశయాల మేరకు కాఫీ పండ్ల దశతోపాటు పార్చ్‌మెంట్ కాఫీ గింజలను ఉత్పత్తి చేసి అమ్మకాలు జరిపే రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. మన్యంలో కాఫీ వ్యాపారానికి దళారి వ్యాపారుల బెడద లేకుండా చూస్తాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

కాఫీ సాగుకు అన్నివిధాలా ప్రోత్సాహం

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కాఫీ రైతులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఒక జిల్లా ఒక పంట అనే అంశంపై అధ్యయనం చేసేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన ఇన్వెస్ట్ ఇండియా బృందం సభ్యులు సభ్యులు సౌమ్య, ఆకాంక్షలతో ఐటీడీఏ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో మిగిలిన పారతాల కన్నా ఇక్కడి పరిస్థితులు విభిన్నమని, ఇక్కడి గిరిజనులు కాఫీ పంటలను సంప్రదాయ పద్ధతిలో పండిస్తారన్నారు. పాడేరు డివిజన్‌లో సుమారు 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు వల్ల 2.46లక్షల మంది లబ్ధి చేకూరుతుందన్నారు. అరకు కాఫీబ్రాండ్ పేరుతో కాఫీ అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ కాఫీ సాగు ప్రయోజనాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఇటీవల బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ కాఫీ సదస్సులు ఉత్తమ రైతు అవార్డు పొందిన పెదబయలు మండలం లక్ష్మీపురం పంచాయతీ కప్పడ గ్రామానికి చెందిన రైతు కిల్లో అశ్వినిని బృంద సభ్యులకు పరిచయం చేశారు. బృందం సభ్యులు ఆమె అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి జీసీసీ, ఐటీడీఏ ఉత్పత్తుల గిఫ్ట్ హేంపర్‌ను అందించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు, సౌమ్య, ఆకాంక్ష మాట్లాడుతూ ఒన్ డిస్ట్రిక్ట్– ఒన్ ప్రొడక్ట్ అధ్యయనానికి దేశంలోని అన్ని జిల్లాల్లో వివిధ బృందాలు పర్యటిస్తున్నాయన్నారు. తమ బృందం విశాఖపట్నంలో చేపల ఉత్పత్తి మీద, అల్లూరిజిల్లాలో కాఫీసాగు, నాణ్యమైన కాఫీ గింజల ఉత్పత్తిపై అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ కె.శివశ్రీనివాస్, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వీఎస్.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, కేంద్ర కాఫీ బోర్డు డీడీ రమేష్, జీసీడీఎం సింహాచలం పాల్గొన్నారు.



ఎం.నిట్టాపుట్టులో కాఫీ పల్పింగ్ యూనిట్‌ను సందర్శించిన ఇన్వెస్ట్ ఇండియా బృందం



ఉత్తమ కాఫీ రైతు అవార్డు పొందిన కిల్లో అశ్వినితో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధులు, ఐటీడీఏ పీవో అభిషేక్

కాఫీ మ్యూజియం సందర్శన

అరకులోయ టౌన్: ఒక జిల్లా, ఒక పంట పరిశీలనకు ఢిల్లీ నుంచి వచ్చిన బృందం సభ్యులు శనివారం అరకులో కాఫీ మ్యూజియం, సుంకరమెట్ట కాఫీ తోటలను పరిశీలించారు. అరకులోయ కాఫీ అద్భుతమని బృందం సభ్యులు ఆకాంక్ష, సౌమ్య అన్నారు. ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, కాఫీ ఏడీ రమేష్, జీసీసీ డివిజనల్ మేనేజర్ దుప్ప సింహాచలం పాల్గొన్నారు.

కాఫీ పల్పింగ్ యూనిట్‌ను సందర్శించిన ఢిల్లీ బృందం

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ ఎం నిట్టాపుట్టు గ్రామంలో కాఫీ పల్పింగ్ యూనిట్‌ను శనివారం ఢిల్లీకి చెందిన ఇన్వెస్ట్ ఇండియా బృందం సభ్యులు సౌమ్య, ఆకాంక్ష సందర్శించారు. కాఫీ పల్పింగ్ విధానాన్ని యూనిట్ సీఈవో గంగరాజు, నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. కాఫీ దిగుబడి, మార్కెటింగ్ తదితర వివరాలను బృందం సభ్యులకు వారు వివరించారు. అటవీహక్కుల పత్రాల పంపిణీ, రైతు భరోసా ప్రయోజనాలను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డు డీడీ రమేష్, జీసీసీ డీఎం సింహాచలం పాల్గొన్నారు.

అయ్యో పాపం!

ఏ కన్నపేగుకు భారమైందో...!
ఏ తల్లి ఒడికి దూరమైందో...!
'ఆడ పిల్ల'గా పుట్టడం శాపమైందో...!!
ఇంకా బొడ్డు పేగు వేలాడుతునే ఉంది...
కన్ను తెరిచిందో లేదో నీటి పాలైంది...
చూపరులను కన్నీరు పెట్టించింది.

- పుట్టగానే నీటిపాలు
- రైవాడ కెనాల్లో బొడ్డూడని పసికందు మృతదేహం



కెనాల్ నీటిలో పసికందు మృతదేహం

కె.కోటపాడు: గవరపాలెం గ్రామం గుండా ఉన్న రైవాడ కెనాల్ మార్గంలో నీటిలో పసికందు శవమై తేలియాడుతూ కనిపించింది. శుక్రవారం రాత్రి పొలాలకు వెళ్తున్న రైతులకు కెనాల్ మార్గంలో ఉన్న మొక్కల్లో చిక్కుకున్న పసికందు మృతదేహం కనిపించింది. వారు ఈ సమాచారాన్ని గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ నిత్యజ్యోతి, ఆశా కార్యకర్త దేవికి తెలిపారు. దీంతో వారు శనివారం తెల్లవారుజామున వచ్చి స్థానికుల సహాయంతో నీటిలో మొక్కల మధ్య చిక్కుకొని ఉన్న పసికందు మృతదేహన్ని బయటకు తీయించారు. ఆ పసికందును ఆడపిల్లగా గుర్తించారు. మృతదేహాన్ని స్థానికుల సహాయంతో ఖననం చేయించారు.

పుట్టిన గంటల వ్యవధిలోనే..

మృతి చెందిన పసికందును నీటిలో పడేశారో... లేదా ఆడపిల్ల అని వదిలించుకోవాలనుకున్నారో కానీ బొడ్డు పేగు కూడా ఉండడంతో పుట్టిన గంటల వ్యవధిలోనే ఎవరో ఈ దారుణానికి ఒడికట్టారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటన గవరపాలెంతో పాటు పరిసర గ్రామాల్లో కలకలం రేపింది. దేవరాపల్లి మండలం రైవాడ జలాశయం నుంచి కెనాల్ మార్గం విశాఖపట్నం వరకూ ఉంది. నీరు దేవరాపల్లి, వేపాడ మండలాల మీదుగా ప్రవహించడంతో పసికందును నీటిలో ఎక్కడ వేశారోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పాడేరు ఎమ్మెల్యే సాహసం



పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శనివారం అత్యంత మారుమూల ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రంపచోడవరం డివిజన్‌లో మండలకేంద్రం వై.రామవరం నుంచి 30 కిలోమీటర్ల దూరంలోని పాడేరు నియోజకవర్గ పరిధి కాకులమామిడి, జ్యోతుల మామిడి, పుట్టకోట, పెదలంక, పెదలంక కొత్తూరు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అతికష్టంమీద జీపులో వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. – కొయ్యూరు

నేడు బధిరుల సంఘ సమావేశం

సాక్షి,పాడేరు: జిల్లాలోని బధిరులందరితో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నామని సంఘ జిల్లా అధ్యక్షుడు ఎల్.కుమారస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బధిరుల సంక్షేమం లక్ష్యంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఈసమావేశంలో ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని బధిరులంతా ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని, పాడేరు పీఎంఆర్‌సీ భవనం రోడ్డులో సమావేశం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందని ఆయన తెలిపారు.

కాలం చెల్లిన పానీయం సేవించడంతో మహిళకు అస్వస్థత



అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న లక్ష్మి



కాలం చెల్లిన పానీయం ప్యాకెట్లు

ఆస్పత్రికి తరలింపు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఓ కిరాణా దుకాణంలో కాలం చెల్లిన ఓ కంపెనీ పానీయం సేవించిన మహిళ అస్వస్థతకు గురైంది. వివరాలివావున్నాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రానికి చెందిన నర్సి లక్ష్మి శనివారం మధ్యాహ్నం ఇదే గ్రామానికి చెందిన అందవరపు మోహన్‌రావు కిరాణా దుకాణంలో టాటా గ్లూకోజ్ పానీయం ప్యాకెట్‌ను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లి తాగింది. కాసేపటికి వాంతులు కావడంతో అస్వస్థతకు గురైంది. వెంటనే స్థానికులు ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. టాటా గ్లూకోజ్ ప్యాక్‌ను పరిశీలిస్తే ఆగస్టు 16తో వినియోగ గడువు ముగిసింది. అందువల్లనే అస్వస్థతకు గురైనట్టు లక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితులకు కారణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

సాక్షి,పాడేరు: ఆయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని కీర్తిస్తూ విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు శనివారం మధ్యాహ్నం పాడేరు పట్టణంలో శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. తలారిసింగి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమాహాల్‌రోడ్డు, బంగారంవీధి, మెయిన్‌రోడ్డు మీదుగా మోదకొండమ్మతల్లి ఆలయం వరకు నిర్వహించారు. రామనామస్మరణ మార్మోగింది. మోదకొండమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు.

సేవాభావం సీఎం జగనన్న సొంతం

- శివారు గ్రామాల్లో గడప గడపకు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మికి గ్రామస్తుల ఘన స్వాగతం
- సమస్య పరిష్కారానికి హామీ



సంక్షేమ పథకాల పోస్టర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఎం.భీమవరం సచివాలయం పరిధిలోని ఆరు గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పటివరకు ఏ నాయకుడు పర్యటించని గ్రామాల్లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటించారు. ఈమేరకు ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 132 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప సేవాభావం కలిగిన ఉత్తమ లక్షణాలున్న వ్యక్తి అని అన్నారు. ఆయనకున్న సేవాభావం వలన పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. పేదల కోసం పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వాని అందరూ ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శివారు గ్రామాల్లో కూడా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ మేరకు శివారు గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడు బి.టెక్ పూర్తి చేయడం అభినందనీయమన్నారు. రవాణా సౌకర్యం లేక ఈ ప్రాంతానికి పాఠశాల రాలేదన్నారు. గ్రామంలో ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసి విద్యా వలంటీర్‌ను నియమిస్తామని కాకులమామిడి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. డిగ్రీ పూర్తి చేసిన వారు ఉంటే వివరాలు అందజేయాలన్నారు.కలెక్టర్‌తో మాట్లాడి నియామకం చేస్తామని హామీ ఇచ్చారు . పండుటాకులకు ఇస్తున్న పెన్షన్ల నుంచి అమ్మఒడి వరకు అన్నింటిని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. వై.రామవరం నుంచి ఎం.భీమవరానికి 14 కిలోమీటర్ల దూరంలో సరైన రహదారి లేకపోవడంతో అదనంగా 80 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ అటవీ శాఖాధికారులతో పాటు కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు వేయిస్తామన్నారు.అదే విధంగా తాగు నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. వంద రోజుల ఉపాధి పనులు పూర్తి చేసిన వేతనదారుడి కుటుంబానికి చెందిన వారికి వివిధ అంశాలపై ఉపాధి శిక్షణ ఇస్తారన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే శిక్షణలో రూ.26 వేలు స్టైఫండ్‌గా పొందుతారన్నారు. ఎం.భీమవరం పంచాయతీలో ఆరు టవర్ల నిర్మాణం త్వరలో పూర్తవుతుందన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్ సువర్ణకుమారి, ఎంపీటీసీ మాధవ్‌రావు, వైస్ ఎంపీపీ వెంకటరమణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, మండల పార్టీ అధ్యక్షులు బాబులు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, నేతలు సుధాకర్, గంగాధర్, సూరిబాబు వలంటీర్లు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గండిపోశమ్మ ఆలయ సందర్శన

దేవీపట్నం: గండిపోశమ్మ అమ్మవారిని శనివారం జిల్లా దేవదాయ, ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ శనివారం సందర్శించారు. దీనిలో భాగంగా ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ ప్రాంతం బురదతో నిండి ఉన్నందున అమ్మవారి దర్శనం తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఈవో జీవీ లక్ష్మీకుమార్ తెలిపారు. త్వరలో దర్శనం తేదీలను ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితుడు కొండబాబుతో ఎస్‌ఐ మనోజ్‌కుమార్



నిందితుడు పండురాజుతో డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్

పెదబయలు/డుంబ్రిగుడ: రెండు మండలాల్లో గంజాయి సాగుచేస్తున్న ఇద్దరిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ కుల్లుభ గ్రామ శివారులో ఐదుసెంట్ల స్థలంలో గంజాయి సాగు చేస్తున్న ఉల్లి కొండబాబును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు స్థానిక ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. మండల పరిసర గ్రామాల్లో ఎవరైన గంజాయి సాగు చేస్తుంటే 9381123100 అనే నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఐదు సెంట్ల స్థలంలో గంజాయి సాగుచేస్తున్న డుంబ్రిగుడ మండలం కొర్రాయి పంచాయతీ కొత్తవలస గ్రామానికి చెందిన సిదేరి పండురాజు(40) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ చెప్పారు. గంజాయి సాగు చేస్తున్నట్టు సమాచారం రావడంతో గ్రామానికి వెళ్లి విచారణ జరిపి, అరెస్టు చేసి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి,పాడేరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డు ఆస్పత్రి సెంటర్‌లో ఈనెల 21వ తేదీ నుంచి జరిగే విజయదశమి ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తమర్బ నరసింగరావు శనివారం ఆవిష్కరించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివరాత్రి నాగేశ్వరరావు,పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పిట్టా నవీన్, బిక్కవోలు రవి, బొజ్జా సూర్యనాగు, శ్యామ్‌పాత్రుడు, ప్రతాప్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ నర్సింగరావు

కాలభైరవునికి ప్రత్యేక పూజలు

సాక్షి, పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన కాలభైరవస్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, అర్చకుడు రామంపంతులు ఆధ్వర్యంలో శనివారం పాలాభిషేకం నిర్వహించారు. గారెలు, పూలదండలతో స్వామివారిని అలకంరించారు.



గారెలు, పూలదండలతో అలంకరించిన కాలభైరవస్వామి విగ్రహం